సాక్షి అనకాపల్లి

మంగళవారం। 29। ఏప్రిల్। 2025



తిరుమలేశునికి పుష్పార్చన

అక్కిరెడ్డిపాలెం: విశాఖ షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీకి సోమవారం వివిధ పుష్పాలతో పూజలు నిర్వహించారు.



కిడ్నీ మార్పిడి సక్సెస్

డాబాగార్డెన్స్: విశాఖ కేజీహెచ్‌లో 16 ఏళ్ల బాలుడికి విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స జరిగింది.

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠం/కనిష్ఠం	
అనకాపల్లి	35.6	26.5
చోడవరం	38.0	24.0

న్యూస్‌రీల్

వేగం, విశ్లేషణ.. అదే విజయ రహస్యం

- సివిల్స్ విజేత సాయి మోహిని మానస



రావాడ సాయి మోహిని మానసను సత్కరిస్తున్న గ్రంథాలయం సభ్యులు

అనకాపల్లి టౌన్: పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పునశ్చరణ, నమూనా పరీక్షలతో వేగంగా సమాధానాలు రాయడం అలవాటు చేసుకోవాలని సివిల్స్ విజేత రావాడ సాయి మోహిని మానస సూచించారు. వేగానికి విశ్లేషణ కూడా తోడైతే సివిల్స్ పరీక్షల్లో విజయానికి చేరువ కాగలుగుతామని చెప్పారు. ఇటీవల విడుదలైన సివిల్స్ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో 975వ ర్యాంకు సాధించిన మానసను గౌరీ గ్రంథాలయం సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షల్లో సమయపాలన, వేగం కీలకమని, ఇందుకోసం అభ్యర్థి రోజుకు ఒకటి రెండు ఆన్‌లైన్ నమూనా పరీక్షలు రాసి స్వీయ విశ్లేషణ చేసుకోవాలని చెప్పారు. పోటీ పరీక్షల్లో ఎక్కువ ప్రశ్నలు జ్ఞాపకశక్తి ఆధారితంగానే ఉంటాయన్నారు. గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు డి.నూక అప్పారావు, కాంద్రేగుల వెంకటరమణ, కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రియల్టర్ ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న 70 ఏళ్ల రియల్ ఎస్టేట్ వ్యాపారి నడింపల్లి సత్యనారాయణరాజు దేవరాపల్లి మండలంలోని మామిడిపల్లి రిసార్ట్‌లో ఆత్మహత్య చేసుకున్నారు.

8లో

- టీడీఆర్‌లపై కూటమి కుయుక్తులు

అభివృద్ధి పేరిట అరాచకాలు

- ఎన్‌వోసీలపై సంతకం పెట్టేలా సామ, దాన, భేద దండోపాయాలు
- గ్రామాల వారీగా రంగంలోకి దిగిన కూటమి పార్టీల కార్యకర్తలు
- మా బాధ అర్థం చేసుకోరా.. అంటున్న నిర్వాసితులు
- అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణలో నిర్వాసితుల కష్టాల కోణం

పేరు అభివృద్ధి.. చేసేది అరాచకం.. ఇదీ కూటమి ప్రభుత్వ సిద్ధాంతం. ఎస్ఈజెడ్‌లో కొత్త పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం చేసేందుకు రెండు దశాబ్దాల నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణకు నిర్వాసితులను ఒప్పించాలని చూశారే గానీ నొప్పించే విధంగా ఏ ప్రభుత్వమూ ప్రయత్నించలేదు. ఇళ్లు, దుకాణాలు, పొలాలను కోల్పోయేందుకు మనసు రాక.. కాదనలేక మధనపడుతున్న బాధితుల పట్ల నేటి చంద్రబాబు సర్కారు అనుసరిస్తున్న వైఖరిపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పరిహారం ఇచ్చి తమ బతుకులకు ప్రత్యామ్నాయం చూపిస్తారని ఆశిస్తున్న నిర్వాసితుల మెడకు ఇప్పుడు టీడీఆర్ గుదిబండ వేలాడుతోంది.



టీడీఆర్‌లకు వ్యతిరేకంగా తిమ్మరాజుపేటలో రోడ్డుపై ధర్నా చేస్తున్న నిర్వాసితులు (ఫైల్)



అచ్యుతాపురం-అనకాపల్లి రహదారిలో సర్వే చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: రహదారి విస్తరణ మాట విన్నప్పుడల్లా నిర్వాసితుల గుండెల్లో రాయి పడుతుంది. పరిశ్రమల స్థాపన కోసం అచ్యుతాపురం-రాంబిల్లి మండలాల్లో వేలాది ఎకరాలు ఇవ్వాల్సివచ్చింది. అంతలోనే అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణ ప్రతిపాదన వచ్చింది. సుమారు 14 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అగ్రహారం, నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట, మునగపాక, తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, చోడపల్లి, మోసయ్యపేట గ్రామాలకు చెందిన రైతుల భూములు, ఇంటి స్థలాల మీదుగా రహదారిని విస్తరించాల్సి ఉంది. ప్రస్తుతం కేవలం 30-40 అడుగుల వెడల్పులో ఉన్న ఈ రహదారి విస్తరణ ఆవశ్యకత కచ్చితంగా ఉంది. అయితే విస్తరణ విషయంలో స్పష్టత లేకపోవడం, ఎన్ని అడుగులు విస్తరిస్తారో తెలియకపోవడంతో 1200 బాధిత కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ గడిపాయి. స్పష్టత వచ్చాక తగిన పరిహారం ఇచ్చి ఆదుకోకపోతారా అన్న ఆశతో ఉన్న వారికి కూటమి సర్కారు తీసుకొచ్చిన ట్రెడ్ డిపాజిట్ రిసీట్ (టీడీఆర్) ప్రతిపాదన పెద్ద శాపంగా పరిణమించింది.

దీని ప్రకారం పరిహారం ఇవ్వకుండా ప్రస్తుతం బాండ్లు ఇస్తారు. నిర్ణీత కాల వ్యవధి ముగిశాక ఆ బాండ్లపై సొమ్ము ఇస్తారు. ఈ ప్రతిపాదనతో తీవ్ర నిరాశకు లోనైన నిర్వాసితులు ఆందోళనల రూపంలో తమ ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. రాస్తారోకోలు, బైఠాయింపులు చేపట్టి తమ వ్యతిరేకత వ్యక్తపరిచారు. వారి బాధను అర్థం చేసుకోవలసింది పోయి ప్రభుత్వం వారిని ఒప్పించడానికి సామ, దాన, భేద దండోపాయాలు ప్రదర్శిస్తోంది. ఇందుకు కూటమి పార్టీల కార్యకర్తలు అన్ని గ్రామాల్లో రంగంలోకి దిగారు.



టీడీఆర్‌లకు వ్యతిరేకంగా మునగపాక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

లోలోన భయం.. అందుకే ప్రలోభాల పర్వం

నిజానికి అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణ ప్రతిపాదన ఇప్పటిది కాదని అందరికీ తెలుసు. అత్యంత కీలకంగా మారిన ఈ మార్గం విస్తరణ కోసం రైతుల నుంచి భూమిని ఏకాభిప్రాయంతో తీసుకోవాలంటే వారు మనస్ఫూర్తిగా ఇవ్వగలగాలి. అంటే మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించి రైతులకు నుంచి తీసుకోవాలి. కానీ నిధులన్నీ అమరావతి వైపు మళ్లిస్తున్నారనే ఆరోపణల మేరకు ఈ ప్రాంత నిర్వాసితులకు నేరుగా నగదు ఇవ్వకుండా టీడీఆర్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. రావాల్సిన పరిహారం కంటే మూడో వంతు తగ్గిపోవడం, అది కూడా ఎందుకూ కొరగాకుండాపోయే టీడీఆర్‌లను బలవంతంగా రుద్దాలనే కుయుక్తుల మేరకు రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ మార్గ విస్తరణకు సంబంధించి రెండు చోట్ల బ్రిడ్జి నిర్మాణ పనులు, ఫ్లై ఓవర్లతో కూడిన పనులు ప్రారంభించిన తరుణంలో రైతులు భూములు ఇవ్వకుంటే పనులు ఎక్కడ ఆగిపోతాయో అన్న భయం కూటమి బడా ప్రతినిధుల్లో నెలకొంది. అందుకే తమ కార్యకర్తలను రంగంలోకి దింపి బాధితులను ప్రలోభాలను గురిచేసే పన్నాగానికి తెరలేపారు. విభజించి పాలించు అనే నినాదంతో నిర్వాసితులను విడివిడిగా కలిసి ఎన్‌వోసీపై సంతకం చేయాలని, వారికి కావాల్సిన ఏ ప్రభుత్వ పనైనా చేస్తామని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. వారు అంగీకరించకపోతే భయపెట్టయినా తమ పని పూర్తి చేసుకునేందుకు రంగంలోకి దిగుతున్నారు. దీంతో రైతులు మరింత మండిపడుతున్నారు.

సంతకం పెట్టేది లేదు

మాది తిమ్మరాపుపేట. రెండు సెంట్ల స్థలం, దుకాణం ఉంది. 30 ఏళ్లగా ఆ దుకాణం మీదే ఆధారపడి జీవిస్తున్నాను. టీడీఆర్ ప్రతిపాదన వల్ల మాకు రావాల్సిన పరిహారంలో 40 శాతమే అందుతుంది. పైగా టీడీఆర్‌లను ఎప్పుడు, ఎక్కడ ఉపయోగించుకోగలం. మరోవైపు ఉపాధి పోతుంది. పరిహార నగదు ఇస్తేనే సంతకం పెడతాం.

–రామారావు, తిమ్మరాజుపేట

ఈ పద్ధతిని ఆమోదించం

రోడ్డు వేయడం తప్పు కాదు. మాకు ఇవ్వాల్సిన పరిహారం న్యాయంగా మార్కెట్ ధర ప్రకారం ఇవ్వాలి. 36 గజాల స్థలం, దుకాణం ఉన్నాయి. ఎన్‌వోసీపై సంతకం పెట్టేదిలేదు. అవసరమైతే కోర్టుకైనా వెళతాం. నియోజకవర్గ ప్రజలు కష్టాలను చూసి పరిహారం ఇప్పించాలే తప్ప, ఇలాంటి పద్ధతి సరికాదు.

–ఈశ్వర్ కుమార్, ఒంపోలు

వెల్లువెత్తిన అర్జీలు.. హోరెత్తిన నిరసనలు

కనికరించని అధికారులు



పింఛన్ పునరుద్ధరణకు మూడు నెలలుగా జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు చుట్టూ తిరుగుతున్నా కనికరించటం లేదని రోలుగుంట మండలం, కొరుప్రోలు గ్రామానికి చెందిన గిరిజన వికలాంగుడు గెమ్మిలి ఆనంద్ వాపోయాడు. మరోసారి కలెక్టర్‌కు విన్నవించుకునేందుకు భార్య, పిల్లలతో సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చానని తెలిపాడు. గ్రామానికి రోడ్డు వేయాలని గ్రామస్తులతో కలిసి డోలీతో నిరసన తెలిపినందుకు పింఛన్ నిలిపివేశారని, పింఛన్ ఆధారంగా నలుగురు పిల్లలను పోషించుకుంటూ జీవిస్తున్న తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నానని బాధితుడు తెలిపారు.

← గెమ్మిలి ఆనంద్



డోలీ మోతతో నిరసన తెలుపుతున్న దొంకాడ గిరిజనులు

నర్సీపట్నం: ఈవారం నర్సీపట్నంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ఫలవంతమైంది. స్వయంగా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి హాజరు కావడంతో అర్జీదారులు పోటెత్తారు. ఒక దశలో తోపులాట కూడా జరిగింది. మొత్తం 252 వినతులు అందాయి. వివిధ సమస్యలపై పలు సంఘాల వారు నిరసన ప్రదర్శనలు చేశారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గొలుగొండ మండలం, దొంకాడ గ్రామ గిరిజనులు డోలీ మోతతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

పూర్తి వివరాలు 8లో

లేటరైట్ ముసుగులో బాక్సైట్ దోపిడీ

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన మాజీ ఎమ్మెల్యే గణేష్

లేటరైట్ తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో నాతవరం మండలం, సుందరకోటలో జరుగుతున్న లేటరైట్ తవ్వకాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు రోజులుగా సాగుతున్న తవ్వకాలు కోర్టు అనుమతుల మేరకు జరుగుతున్నాయా.. లేక ప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందా అన్న దానిపై స్పష్టత ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. లేటరైట్ ముసుగులో రూ.15 వేల కోట్ల విలువైన బాక్సైట్ దోపిడీ జరుగుతుందని సీఎం చంద్రబాబునాయుడు గతంలో ఆరోపించారన్నారు. లేటరైట్ కాదు బాక్సైట్ అన్నప్పుడు అనుమతులు ఎలా ఇచ్చారని గణేష్ ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు అనుమతులు వస్తే నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న తవ్వకాలపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సుందరకోట బమిడకలొద్దు నుంచి మైనింగ్ లారీలతో వెళ్లాలంటే వేంబ్రిడ్జి ఉండాలన్నారు. వేయింగ్ తర్వాతే లారీలు బయటకు వెళ్లాలన్నారు. కాకినాడ జిల్లా చల్లూరు తీసుకువెళ్లి వేయింగ్ చేసి రాకంపాడు యార్డుకు తరలించటం నేరమన్నారు. రోజుకు 5 వేల టన్నుల లేటరైట్ తరలిస్తూ కేవలం వెయ్యి టన్నులకు రాయల్టీ చెల్లిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. మైనింగ్ ఇష్యూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉందన్నారు. కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ చట్టవిరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారని గణేష్ ఆరోపించారు. అధికార యంత్రాంగం మైనింగ్ విషయాన్ని నీరుగారిస్తే ఆ ప్రాంత గిరిజనులతో సమావేశమై లేటరైట్ తవ్వకాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.



లేటరైట్ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

రేపే అప్పన్న చందనోత్సవం



- తెల్లవారుజామున 3.30 గంటలకు సర్వదర్శనం ప్రారంభం
- సాయంత్రం 6 గంటల తర్వాత సింహగిరిపైకి అనుమతి లేదు
- రాత్రి 7 గంటలకు సింహగిరిపై క్యూల ప్రవేశ గేట్లు మూసివేత
- ప్రొటోకాల్ వీఐపీలకు ఉదయం 6 గంటలతో అంతరాలయ దర్శనాలు పూర్తి
- ఆ తర్వాత అందరికీ నీలాద్రిగుమ్మం నుంచే లఘు దర్శనం
- 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

సింహాచలం : వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని సంవత్సరమంతా చందనం మణుగుల్లో నిత్యరూపంలో దర్శనమిచ్చే సింహాద్రినాథుడి నిజరూప దర్శనం లభించే సమయం ఆసన్నమైంది. సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం బుధవారం జరగనుంది. ఏడాదిలో కేవలం ఒక్క రోజులోని కొన్ని గంటలు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనాన్ని చేసుకునేందుకు భక్తులు తరలిరానున్నారు. ఈసారి 2 లక్షల మంది భక్తులు స్వామి నిజరూప దర్శనం చేసుకుంటారని అంచనా వేశారు. సాధారణ భక్తులకు పెద్ద పీట వేస్తూ.. వారికి దర్శనాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సింహాచలం ఈవో కె.సుబ్బారావు నేతృత్వంలో జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది.

వెండిబొరుగులతో చందనం ఒలుపు

చందనోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్గరణం, కలశారాధన చేస్తారు. అనంతరం వెండిబొరుగులతో స్వామిపై ఉన్న చందనాన్ని తీసి నిజరూపభరితుడిని చేస్తారు.

తెల్లవారుజామున 3 గంటలకు దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకి తొలిదర్శనం కల్పిస్తారు. 3.30 గంటల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించే రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్, టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించేవారికి దర్శనం కల్పిస్తారు. ఉదయం 6 గంటలతో అంతరాలయ దర్శనాలు పూర్తిచేస్తారు.

ఉదయం 3.30 గంటల నుంచి సర్వదర్శనం


ఉదయం 3.30 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభిస్తారు. ఉచిత దర్శనం, రూ.300, రూ.1000 టికెట్ల క్యూల్లో ఉన్న వారందరికీ దర్శనాలు ప్రారంభిస్తారు. సాయంత్రం 6 గంటల వరకే సింహగిరిపై దర్శనాల క్యూల్లోకి భక్తులను అనుమతిస్తారు. రాత్రి 7 గంటలకు క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి అప్పటి వరకు క్యూల్లో ఉన్న భక్తులకు స్వామి ద ర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపైకి బస్సుల్లో భక్తులను అనుమతిస్తారు. 29వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటల తర్వాత కూడా భక్తులను కొండపైకి అనుమతించరు. చందనోత్సవంలో విధులు నిర్వర్తించే పోలీసులు సామాన్య భక్తులతో మర్యాద కలిగి, అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు.

ఏర్పాట్లు ఇలా...

- అడవివరం సమీపంలోని రెండో ఘాట్‌రోడ్డు నుంచే బస్సులు సింహగిరికి వెళ్లేలా.. తొలి ఘాట్‌రోడ్డులో బస్సులు కిందకు దిగేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.
- 30వ తేదీ తెల్లవారుజాము 3 గంటల నుంచి పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్‌ల నుంచి దేవస్థానం ఏర్పాటు చేసిన బస్సుల్లో మాత్రమే సింహగిరిపైకి భక్తులను అనుమతిస్తారు. దేవస్థానం అద్దె చెల్లించిన 51 ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా భక్తులకు రవాణా సదుపాయం ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం, రూ.300 టికెట్ల వారికి ఆర్టీసీ బస్సులు, రూ.1000, రూ.1500 టికెట్ల వారికి మినీ బస్సులు సిద్ధం చేశారు.
- తొలిసారిగా ఉచిత లడ్డూ ప్రసాదం అందిస్తున్నారు. ఈమేరకు 1.7 లక్షల చిన్న లడ్డూలను సిద్ధం చేస్తున్నారు.
- కొండదిగువ పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్, శ్రీనివాసనగర్‌లో లడ్డూ ప్రసాదం విక్రయిస్తారు. ఈ మేరకు 60 వేల లడ్డూలను సిద్ధం చేశారు.
- దివ్యాంగులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక దర్శన సమయం కేటాయించారు. దివ్యాంగుడితో ఒకరిని సహాయకుడిగా అనుమతిస్తారు.
- ఒకేసారి 25,300 మంది భక్తులు వేచి ఉండేలా సింహగిరిపై 37,950 వేల రన్నింగ్ ఫీట్ మేర దర్శనాల క్యూలను రూపొందించారు.
- ప్రస్తుతం ఉన్న 106 పర్మినెంట్ మరుగుదొడ్లతో పాటు అదనంగా 133 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.
- స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ, శీతల పానీయాలు, అల్పాహారాలు, స్నాక్స్ అందించనున్నాయి.
- దర్శనాంతరం సింహగిరిపై అన్నదాన భవనం వద్ద 60 వేల మందికి దద్దోజనం, కదంబం అన్నప్రసాదంగా అందించనున్నారు.
- కేశఖండనశాలకు కేవలం సింహగిరిపై లోవతోట ప్రాంతం నుంచి మాత్రమే వెళ్లేలా ఏర్పాటు చేశారు.
- కొండపైన 8, కొండ దిగువన 7 వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 29, 30 తేదీల్లో 513 మంది వైద్య సిబ్బంది నాలుగు షిఫ్టుల్లో పనిచేస్తారు. 32 అంబులెన్సులు, 10 స్ట్రెచర్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు, వైద్యులు అందుబాటులో ఉంటారు.
- సీపీ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో 2 వేల మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.
- రాత్రి 9 గంటల నుంచి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తారు. ఇందుకోసం ఉత్తర, దక్షిణ రాజగోపురాల వద్ద ప్రత్యేకంగా బ్రిడ్జిలు ఏర్పాటుచేశారు.
- నిఘా కోసం 206 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు.
- చందనోత్సవంకి సంబంధించిన సమాచారం 0891-275666 నెంబర్‌లో తెలుసుకోవచ్చు.
- డ్యూటీ పాస్ ఉన్న వెహికల్స్‌ని మాత్రమే పరిమితంగా సింహగిరిపైకి అనుమతిస్తారు.

సామాన్య భక్తులకే పెద్దపీట

బీచ్‌రోడ్డు: చందనోత్సవంలో సాధారణ భక్తుల దర్శనానికి తొలి ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. చందనోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో ఆయన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొండపైన, కింద నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్న ఆర్టీసీ బస్సులను మాత్రమే నడపాలని ఆదేశించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా విక్రయించే టికెట్లపై సీరియల్ నంబర్, స్కానింగ్, క్యూలను సూచించే బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సింహాచలం ప్రాంతంలోని మద్యం షాపులను మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు మూసివేయాలని అధికారులకు ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వరి పంట వ్యర్థాల నుంచి ఇంధన తయారీ!

- అవకాశాలను పరిశీలించిన ఎస్ఏఈఎల్ సంస్థ



జోగారావుపేటలో స్థల పరిశీలన

కశింకోట: పేరంటాలపాలెం శివారు జోగారావుపేట గ్రామంలో ఢిల్లీకి చెందిన సస్టెయినబుల్ అండ్ ఎఫోర్డబుల్ ఎనర్జీ ఫర్ లైఫ్ (ఎస్ఏఈఎల్) సంస్థ ప్రతినిధుల బృందం సోమవారం స్థల పరిశీలన జరిపింది. సంస్థ ఉపాధ్యక్షుడు నరేంద్ర సింగ్ నాయకత్వంలోని బృందం వరి పంట వ్యర్థాల నుంచి ఇంధనాన్ని తయారు చేసే పరిశ్రమ ఏర్పాటుకు గల అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై వివరాలను సేకరించింది. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఈ తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్రంలో కూడా ఇటువంటి పరిశ్రమ ఏర్పాటు చేయడానికి గల అవకాశాల గురించి పరిశీలించింది. మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



అంగన్‌వాడీ సిబ్బందితో నాగాలాండ్ ప్రనినిధులు

గొలుగొండ: నాగాలాండ్‌కు చెందిన ప్రతినిధుల బృందం సోమవారం పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించింది. అక్కడి పరిస్థితులు, పిల్లలకు అందుతున్న ప్రాథమిక విద్య, పౌష్టికాహార పంపిణీపై బృందం సభ్యులు అధ్యయనం చేశారు. మండలంలోని జోగంపేట-1, -2, అమ్మపేట, ఎ.ఎల్.పురం-6, పప్పుశెట్టిపాలెం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి నివేదిక తయారు చేశారు. నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన సీడీపీవో ఎమిలాఎనతన్, సూపర్‌వైజర్ హెకాలి ఎప్తోమి కేంద్రాల్లోని పలు అంశాలపై అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శ్రీగౌరి, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో నిరసనల హోరు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి


అర్జీలను ఆన్‌లైన్ చేస్తున్న సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బంది

- సబ్ కలెక్టర్ కార్యాలయంలో 252 అర్జీల స్వీకరణ
- అధికారులు విధిగా హాజరు కావాలి : కలెక్టర్ విజయ కృష్ణన్

నర్సీపట్నం: సబ్ కలెక్టర్ కార్యాలయం నిరసనలతో హోరెత్తింది. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీదారులు పోటెత్తారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం అర్జీదారులతో కిటకిటలాడింది. ఉదయం 10 గంటలకు రావాల్సిన కలెక్టర్ విజయ కృష్ణన్ 11.15 గంటలకు వచ్చారు. కలెక్టర్ రాక కోసం అర్జీదారులు నిరీక్షించారు. ఎట్టకేలకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి వచ్చి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు మూకుమ్మడిగా రావడంతో తోపులాట జరిగింది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని క్యూ ఏర్పాటు చేశారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు అర్జీదారులు మండుటెండలో క్యూ కట్టారు. ఎండకు తాళలేక తలపై అర్జీ పేపర్లను పెట్టుకున్నారు. పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కార్యాలయం లోపల నిరసనలు తెలిపారు. అధికారుల తీరుకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కలెక్టర్‌కు తమ గోడు విన్నవించుకునేందుకు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో అర్జీదారులు తరలివచ్చారు. గుంపుగా వచ్చిన వారిని లోపలికి అనుమతించలేదు. ఒకరు లేదా ఇద్దరిని మాత్రమే అనుమతించారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గొలుగొండ మండలం డొంకాడ గ్రామ గిరిజనులు డోలీ మోతతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు.


ఫిర్యాదు పత్రాలతో ఎండలో క్యూలో నిల్చున్న అర్జీదారులు

సకాలంలో అర్జీలకు పరిష్కారం

పీజీఆర్ఎస్ కార్యక్రమానికి డివిజన్, మండల స్థాయి అధికారులు కచ్చితంగా హాజరు కావాలని కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమెతో పాటు జాయింట్ కలెక్టర్, ఆర్డీవో వి.వి.రమణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం కాని అర్జీల గురించి కారణాలను వివరంగా దరఖాస్తుదారుడికి తెలియజేస్తే అర్జీలు రీఓపెన్ కాకుండా నివారించవచ్చన్నారు. మొత్తం 252 అర్జీలు నమోదు కాగా.. అత్యధికంగా రెవెన్యూ శాఖకు 122, మున్సిపల్ 57, పోలీసు 11, ఇతర శాఖలకు సంబంధించి 62 అర్జీలు వచ్చాయి.

బతికేందుకు ఆధారం చూపండి..



నా భర్త గంగరాజు పేరున ఉన్న ఐదెకరాలను కుమారుడు పేరున పాసు పుస్తకాలు చేయించుకుని అనుభవిస్తున్నాడు. నేను బతకడానికి ఏమీ ఇవ్వడం లేదు. గతంలో తహసీల్దార్, ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదు. నా కొడుకు దగ్గర ఉన్న భూమిలో రెండెకరాలైనా ఇవ్వాలని కలెక్టరు అమ్మను వేడుకున్నా.

– అనిమిరెడ్డి రాజులమ్మ, బుచ్చంపేట, రోలుగుంట మండలం

భూమిని సరి చేయాలి..



మాకవరపాలెం మండలం, గంగవరం రెవెన్యూ పరిధిలో 35 సెంట్లు స్థలం కొనుకున్నా. జిరాయితీ భూమిని ఆన్‌లైన్‌లో ఇనాం భూమిగా చూపిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ అనేక సార్లు తిరిగినా ప్రయోజనం లేదు. ఆప్షన్ లేదని అధికారులు చెప్పుతున్నారు. కలెక్టర్ న్యాయం చేస్తారని అర్జీ పెట్టుకున్నాను.

– పైల సత్యవతి, కేడీ పేట, గొలుగొండ మండలం

వెలవెలబోయిన కలెక్టరేట్

- అర్జీదారులు లేక మధ్యాహ్నం 12 గంటలకే ఖాళీ
- డీఆర్వో ఆధ్వర్యంలో అర్జీల స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో సత్యనారాయణరావు, ఇతర అధికారులు

తుమ్మపాల: నర్సీపట్నంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు కలెక్టర్ విజయ కృష్ణన్ వెళ్లిపోవడంతో అనకాపల్లి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమం బోసిపోయింది. అర్జీదారులు అంతంత మాత్రంగా వచ్చారు. దీంతో మధ్యాహ్నం 12 గంటలకే అధికారులు వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఈ వారం కూడా కలెక్టరేట్ సిబ్బంది దివ్యాంగులను లోపలికి రానీయలేదు. దీంతో వారంతా గంటల పాటు అధికారుల కోసం బయటే నిరీక్షించారు. అర్జీల్లో అధికంగా పునరావృతమయ్యాయి. అధికారులు చెప్పే సమాధానమే సమస్య పరిష్కారంగా చూపి అర్జీని ముగించేస్తున్నారని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని పలువురు వాపోతున్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేందుకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్(ఏపీఐఐసీ) మనోరమ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతుల అర్జీలను ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి నేరుగా స్వీకరించారు.

తల్లి మృతికి కారకులపై విచారణకు డిమాండ్

తన తల్లి మృతికి కారణమైన వారిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతూ నక్కపల్లి మండలం ఉద్దండపురానికి చెందిన ఆవాల సురేష్ ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయితీ ఉందంటూ తనను రావాలని చెప్పి సాయంత్రం 6 గంటల సమయంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తన ఇంటికి వెళ్లి తల్లి అవాల లక్ష్మిని గాయపరిచారని, వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించినా ఫలితం లేదన్నారు. నిందితులకు సహకరిస్తున్న ఎస్‌హెచ్‌వోను బదిలీ చేసి, విచారణ చేపట్టాలని కోరారు.

సోదరుడి దౌర్జన్యంపై ఫిర్యాదు

పసుపు, కుంకుమ కింద తన తండ్రి రాసిచ్చిన భూమిలోకి సోదరుడు రానివ్వడం లేదంటూ కోటవురట్ల మండలం టి.జగ్గంపేటకు చెందిన దివ్యాంగురాలు వంటాకుల వేణమ్మ ఫిర్యాదు చేశారు. టి.జగ్గంపేట రెవెన్యూ సర్వే నంబర్ 73/2ఏలో కొంత భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేసినప్పటికి సోదరుడు అప్పలనాయుడు రానివ్వడం లేదన్నారు. తన తండ్రి మరణించడంతో అనాథను అయ్యానని, న్యాయం చేయాలని వేడుకున్నారు. గతేడాది కూడా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపారు.

గతేడాదిలో మంజూరైన బిల్లు చెల్లించాలి


మొల్లి నాయుడు

గత ప్రభుత్వంలో మంజూరైన విలేజ్ హెల్త్ కేంద్రాన్ని నిర్మించానని, అందుకు సంబంధించిన రూ.7.5 లక్షల బిల్లును తక్షణమే చెల్లించాలని కోరుతూ సబ్బవరం మండలం మొగలిపురానికి చెందిన మొల్లి నాయుడు అర్జీ అందజేశారు. 2024 నవంబర్‌లో మంజూరైన బిల్లు నేటికీ చెల్లించకుండా పంచాయతీ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికి అనేక సార్లు వినతులు అందజేశానని, ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

షోర్ టు షోర్ జీఎం దిలీప్ పింటోను అరెస్టు చేయాలి


దిలీప్ పింటోను అరెస్టు చేయాలంటూ బాధితురాలితో కలిసి ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ షోర్ టు షోర్ కంపెనీలో హెచ్ఆర్‌గా పని చేసిన తనపై జనరల్ మేనేజర్ దిలీప్ పింటో లైంగికంగా వేధించి, ఉద్యోగం నుంచి తొలగించిన ఘటనపై కోర్టు ఆదేశాలను అమలు చేయాలంటూ ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బాధితురాలు డిమాండ్ చేశారు. నేషనల్ యునైటెడ్ ఫ్రంట్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆమె డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ గేటు వద్ద నిరసన చేస్తూ తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది. నేషనల్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ నాయకుడు దౌలత్ రామ్ మాట్లాడుతూ నిందితుడు దిలీప్ పింటోనీ అరెస్ట్ చేయకపోవడంతో శ్రీలంకకు పారిపోయాడన్నారు. బాధితురాలికి ఉద్యోగం ఇచ్చి, పరిహారం చెల్లించాలని జాతీయ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను కలెక్టర్ అమలు చేయలేదని ఆరోపించారు. గత పదేళ్లుగా బాధితురాలు అన్యాయానికి గురవుతుందనే విషయాన్ని పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా అధికారులకు తెలియజేశామన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరులు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటలక్ష్మి, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం కో– కన్వీనర్ రూప, భీమ్ సేన వార్ అధ్యక్షుడు చంద్రశేఖర్, జాతీయ ఎస్సీ, ఎస్టీ సంఘాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశాఖ రియల్టర్ ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- మామిడిపల్లి రిసార్ట్‌లో ఘటన

దేవరాపల్లి : విశాఖపట్నానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నడింపల్లి సత్యనారాయణరాజు(70) దేవరాపల్లి మండలం మామిడిపల్లిలోని రిసార్ట్‌లోని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన రాసిన సూసైడ్ నోట్‌ను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడు భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపారు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విశాఖకు చెందిన సత్యనారాయణరాజు 40 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా కొంత మంది నుంచి తనకు రావలసిన బకాయిలు రూ.కోట్లలో ఉండిపోయాయి. దీంతో ఆయన తీవ్రంగా నష్టపోయారు. దేవరాపల్లి మండలం మామిడిపల్లి రిసార్ట్‌కు సత్యనారాయణరాజు అప్పుడప్పుడు వచ్చి ఒక్కరోజు ఉండి వెళ్లిపోయేవారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు రిసార్ట్‌కు వచ్చిన ఆయన మధ్యాహ్నం, రాత్రి భోజనం చేశారు. సోమవారం ఉదయం రిసార్టు మేనేజర్ రాయిశివ చూసేసరికి గది బయట ఉన్న ఊయల కొక్కానికి సత్యనారాయణరాజు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించారు. వెంటనే ఆయన ఈ విషయాన్ని దేవరాపల్లి పోలీసులతో పాటు మృతుని బంధువులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చనిపోయే ముందు తనకు రావలసిన బకాయిల గురించి, ఆరుగురికి విడివిడిగా రాసిన ఉత్తరాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణరాజు రిసార్ట్‌కు వచ్చినప్పుడల్లా తీవ్రంగా మదనపడుతూ ఏడ్చేవారని రిసార్టులో పని చేస్తున్న సిబ్బంది పోలీసులకు తెలిపారు. మృతుడు భార్య, కుమారుడు సాయి చైతన్యవర్మ అందించిన సమాచారం మేరకు లోతుగా దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.


మామిడిపల్లి రిసార్ట్‌లో ఉరివేసుకున్న రియల్టర్ సత్యనారాయణరాజు

ఎస్పీ కార్యాలయానికి 30 అర్జీలు


అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 అర్జీలు వచ్చాయి. ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, తదితర వాటిపై అర్జీలు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఎస్‌బీ సీఐ టి.లక్ష్మి, ఎస్ఐ డి.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత


దివ్యాంగ బాలలతో గవర్నర్ హరిబాబు దంపతులు

- ఒడిశా గవర్నర్ హరిబాబు పిలుపు

అచ్యుతాపురం రూరల్: విధి చిన్నచూపు చూసిన దివ్యాంగులను సాటి మనుషులే ఆదుకోవాలని, ప్రేమాభిమానాలతో బాధ మరిచిపోయేలా చేయాలని ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు పిలుపునిచ్చారు. కొండకర్ల ఆవకు సమీపంలో ఉన్న ఇచ్ఛా ఫౌండేషన్‌ను ఆయన సోమవారం సతీమణితో కలిసి సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కన్న తల్లిదండ్రులే తమకెందుకులే అనుకుంటున్న ప్రస్తుత సమయంలో దివ్యాంగ బాలలను కంటికి రెప్పలా చూసుకుంటున్న ఇచ్ఛా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మధు తుగ్నైట్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందకపోయినా కేవలం దాతల సహకారంతోనే సంస్థను నడిపించడం చాలా గొప్ప విషయమన్నారు. అవకాశం ఉన్నవారు దివ్యాంగులకు అవసరమైన గృహోపకరణాలు అందివ్వాలని కోరారు. తన వంతు సహాయంగా రూ.25 వేలు ఫోన్–పే ద్వారా సంస్థకు అందజేశారు. ఈ సందర్భంగా మరికొందరు ప్రముఖులు వారి పుట్టిన రోజు, పెళ్లి రోజు సందర్భంగా సంస్థకు చెక్కులు, నగదు రూపంలో విరాళాలు అందజేశారు.

డీసీసీబీ చైర్మన్‌గా కోన తాతారావు

పెదగంట్యాడ: విశాఖ జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్‌గా కోన తాతారావును నియమించారు. ముసలివానిపాలేనికి చెందిన ఈయన టీడీపీలో రాజకీయ జీవితం ప్రారంభించారు. కార్పొరేటర్‌గా పని చేశారు. అనంతరం జనసేనలో చేరారు.

మేయర్‌గా పీలా ఏకగ్రీవం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ మేయర్‌గా కార్పొరేటర్ పీలా శ్రీనివాస్‌ను కూటమి కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మేయర్ ఎన్నికకు జేసీ మయూర్ అశోక్ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సంఘటన స్థలంలో సర్వారావు మృతదేహం

కోటవురట్ల: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం శివపురానికి చెందిన కొరుప్రోలు వెంకట కనక సర్వారావు(47) మాకవరపాలెం మండలం రాచపల్లి జంక్షన్‌లోని ఓ కిరాణా షాపులో పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్వగ్రామం ఎస్.రాయవరం మండలం ఒమ్మవరం వెళ్లాడు. తిరిగి సోమవారం మధ్యాహ్నం బైక్‌పై వేగంగా వస్తూ రామచంద్రపురం జంక్షన్‌కు శివారున రోడ్డు పక్కన ఉన్న సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య నాగరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

హెల్మెట్ పెట్టుకుంటే బతికేవాడేమో..

సర్వారావు హెల్మెట్ పెట్టుకోకపోవడంతోనే తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందినట్టు తెలుస్తోంది. అయితే మృతుడు వస్తున్న బైక్‌కు వెనక హెల్మెట్ లాక్ చేసి ఉంది. హెల్మెట్‌ను వాహనానికి పెట్టేకంటే తలకు పెట్టుకుని ఉంటే స్వల్ప గాయాలతో బయటపడేవాడని ఘటనా స్థలంలో స్థానికులు చర్చించుకున్నారు.

గంజాయి కేసులో ముగ్గురికి పదేళ్లు జైలు

చోడవరం: గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు పదేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. 2015 డిసెంబరు 28న చీడికాడ మండలం జి.కొత్తపల్లి సమీపంలో 100 కేజీల గంజాయి తరలిస్తుండగా పోలీసులు తనిఖీల్లో చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన జాజిమొగ్గల సంతోష్, గెంజి మరిడిబాబు, జాజిమొగ్గల దేముడు పట్టుబడ్డారు. గంజాయిని స్వాధీనం చేసుకుని అప్పటి ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. చోడవరం 9వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రత్నకుమార్ ఈ కేసులో వాదనలు విని, నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేశారు. పదేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించలేని పక్షంలో మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకట్రావు అన్ని వివరాలు కోర్టుకు అందించడంతో నేరం రుజువైందన్నారు.

విద్యుత్ తీగల చోరీ ముఠా అరెస్ట్

పాయకరావుపేట: జిల్లాలో విద్యుత్ తీగలను చోరీ చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్టు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పాయకరావుపేట మండలం రాజగోపాలపురానికి చెందిన మంగి సుధాకర్‌రెడ్డితో సహా మరో ఐదుగురు యువకులు కలిసి కశింకోట, పరవాడ, పాయకరావుపేట పోలీసు స్టేషన్ల పరిధిలో విద్యుత్ వైర్ల దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి కారుతో వెళ్లి విద్యుత్ వైర్లు కట్ చేసి పట్టుకుపోయారు. పాయకరావుపేట మండలం రాజగోపాలపురం గ్రామానికి చెందిన మంగి సుధాకర్‌రెడ్డి, విజయనగరం జిల్లా కొత్తవలస మండలానికి చెందిన వ్యక్తి, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ మండలం రంగానిగూడకు చెందిన కొర్రి రాజు, గొబిస్ కార్తీక్, జన్ని కిరణ్ యువకులతో పాటు మరో ఇద్దరు మైనర్లు కూడా ఈ దొంగతనాలకు పాల్పడుతున్నారని డీఎస్పీ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఇద్దరు వ్యక్తులు స్తంభాలు ఎక్కి తీగలు కట్ చేయడం, మరో ఇద్దరు వ్యక్తులు ఆ తీగలను కట్ చేసి కట్టలు కట్టి కారులో తరలించడం చేసేవారని చెప్పారు. ప్రధాన నిందితుడు సుధాకర్‌రెడ్డి విజయనగరంలోని ఓ స్క్రాప్ దుకాణం యజమానితో సంబంధాలు ఏర్పాటు చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. గత వారం గురువారం స్థానికంగా పీఎల్ పురం సమీపాన ఉన్న దొరనగర్‌లో సంచరిస్తుండగా సీసీ కెమెరాల సహాయంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు వెలుగులోకి వచ్చాయన్నారు. రాజగోపాలపురంలోని సుధాకర్‌రెడ్డి గృహం వద్ద విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో 1400 కిలోల వైర్లు, పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 200 కిలోలు, పరవాడ పోలీసు స్టేషన్‌లోనే మరో కేసులో 100 కేజీలు, పాయకరావుపేట పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు 400 కేజీలు వైర్లు చోరీకి గురైనట్లు కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుల నుంచి రూ.84 వేలు నగదు, విద్యుత్ వైర్లు, కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నలుగురు నిందితులను కోర్టుకు తరలించినట్లు, మరో ఇద్దరు మైనర్లను జువైనల్ కోర్టుకు తరలించామని చెప్పారు. ఈ సమావేశంలో సీఐ జి.అప్పన్న, ఎస్ఐ పురుషోత్తం, ఏఎస్ఐ పి.గోవింద్, సిబ్బంది కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


అదుపులోకి తీసుకున్న నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, తదితరులు

క్లుప్తంగా

ముగిసిన పాలిసెట్ ఉచిత శిక్షణ



ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఉమాశంకర్

కశింకోట: స్థానిక ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయంలోని రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి పాలిసెట్ ఎంట్రన్స్ టెస్టుకు నెల రోజులపాటు నిర్వహించిన ఉచిత శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాక్ టెస్టు నిర్వహించి, దానిలో అత్యధిక మార్కులు సాధించి మొదటి మూడు ర్యాంకుల్లో వరుసగా నిలిచిన విద్యార్థులు పి. గౌతం, ఒమ్మి కవిత, ఎం. భవానీశంకర్‌లకు బహుమతులు అందజేశారు. శిక్షణ కాలంలో ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. ఉమాశంకర్, జనరల్ సెక్షన్ విభాగాధిపతి ఎస్. గణేష్, లెక్చరర్లు వీరేంద్ర, మదీనా, సురేష్, రమణకుమార్, జగన్మోహిని తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



మాట్లాడుతున్న జూనియర్ వెటర్నరీ అధికారి కరుణశ్రీ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. వీటిని స్థానిక జూనియర్ వెటర్నరీ అధికారి సిహెచ్. కరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించడానికి శిక్షణ తరగతులు ఉపయోగపడనున్నాయని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటిలో నీతి కథలు బోధన, పుస్తకాల పఠనం, సంగీతం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్టు వర్క్, క్విజ్, జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లిష్, పుస్తక సమీక్ష, నృత్యం, ఆటలు ఆడటం తదితర కార్యక్రమాలపై శిక్షణ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ తరగతులకు రోజూ పంపాలన్నారు. గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని, వీటికి విద్యార్థులు హాజరై వివిధ కళల్లో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సిహెచ్. శాంతి, జె. అశ్విని, విద్యార్థులు, పాఠకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

మునగపాక: స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం అనకాపల్లి ఆర్డీవో అయిషా సందర్శించారు. పూడిమడక రోడ్డు విస్తరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలన్నారు. బాధితుల వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ ఆదిమహేశ్వరరావుకు సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 1,466 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
స్పెషల్ రకం	4,200	4,750
మొదటి రకం	3,890	4.590
రెండో రకం	3,600	4,220
మూడో రకం	3,300	3,550

అనకాపల్లి సినిమాలు

రాజా : జింఖానా
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : సారంగపాణి జాతకం
పర్తిసాయి : ఓదెలా-2
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : పాఠం
శ్రీసత్య : భరత్ అనే నేను
రామచంద్ర : తుడరుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-5, ఓ పాజిటివ్-25, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 422 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 381 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ఆర్వో ప్లాంట్ మూత



- శుద్ధజలం కోసం పట్టణవాసుల ఇక్కట్లు
- ప్రైవేటుగా మినరల్ వాటర్ కొనుగోలు
- పట్టించుకోని కూటమి పాలకులు



వేల్పులవీధిలో మూతపడిన ఆర్వో వాటర్ ప్లాంట్



వృథాగా పడి ఉన్న వాటర్ ట్యాంక్

అనకాపల్లి టౌన్: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో పట్టణంలోని వేల్పుల వీధిలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మూత పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నామమాత్రపు ధరకే ప్రజలకు మంచినీరు అందకుండా పోయింది. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్ నిర్మించి ప్రారంభించారు. ఈ ప్లాంట్‌కు పట్టణం నుంచే కాకుండా మండలాల నుంచి కూడా అధిక సంఖ్యలో వచ్చే ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందజేశారు. గవరపాలెం, మళ్లవీధి, చిన్నవీధి, లక్ష్మీదేవి పేట, గాంధీనగరం, విజయరామరాజు పేట, ఆమంచి వారివీధి, సమీప గ్రామాలైన కొత్తూరు, చినబాబు కాలనీ, తుమ్మపాల తదితర ప్రాంతాల నుంచి వచ్చేవారు. రూ.2కే 20 లీటర్ల స్వచ్ఛమైన నీరు లభించేది. దీంతో ఎక్కువ మంది ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేది.

రాజకీయ కారణాలతో మూత..

ప్రజలకు తక్కువ ఖర్చుతో మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్లాంట్ రాజకీయ కారణాలతో మూత పడింది. ఇక్కడ పని చేస్తున్న సిబ్బందిని తొలగించి తమకు అనుకూలమైన వారిని నియమించాలని అధికారులపై కూటమి పాలకులు ఒత్తిళ్లు తీసుకొచ్చారు. దాంతో సుమారు తొమ్మిది నెలల నుంచి తెరుచుకోలేదు. అప్పటి నుంచి దీన్ని పట్టించుకునే నాథుడే లేకపోవడంతో పట్టణ ప్రజలకు శుద్ధినీరు కరువైంది. దీంతో అధిక ధర వెచ్చించి ప్రైవేట్ ప్లాంట్‌ల వద్ద నీటిని కొనుగోలు చేస్తున్నారు. కొందరు విధిలేని పరిస్థితుల్లో ఇతర చోట్ల నుంచి శుద్ధి జలం తెచ్చుకొని తాగుతున్నారు. జీవీఎంసీ అధికారులు మాత్రం ఆర్వో ప్లాంట్‌ను మరిచారు. అప్పట్లో ఆర్వో ప్లాంట్‌కు ఒక డీప్ బోర్ ద్వారా కనెక్షన్ ఇచ్చారు. ఆ డీప్ బోరుతోపాటు ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన మిషనరీ పాడైపోయే ప్రమాదం నెలకొందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఆర్వో ప్లాంట్ ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉండటంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

> **అధిక ధరకు మినరల్ వాటర్ కొనుగోలు**
>
> ఆర్వో ప్లాంట్ వద్ద తక్కువ ధరకే మినరల్ వాటర్ లభించేది. తొమ్మిది నెలల క్రితం ప్లాంట్ మూత పడడం వల్ల ప్రైవేటు వాటర్ ప్లాంట్స్ వద్ద అధిక ధరకు మంచినీటిని కొనుగోలు చేస్తున్నాం. తక్షణమే వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.
>
> – సతీష్, అనకాపల్లి

> **అనుమతి రాగానే వినియోగంలోకి...**
>
> ప్రస్తుతం ఆర్వో ప్లాంట్ వినియోగంలో లేదు. దీని నిర్వహణపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. వారి నుంచి అనుమతులు రాగానే ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకువస్తాం.
>
> – హరీష్, ఏఈ తాగునీటి సరఫరా విభాగం, జీవీఎంసీ అనకాపల్లి జోన్

చెరువు, కాలువ ఆక్రమణలపై ఫిర్యాదు

చెరువు, కాలువ ఆక్రమణలపై ఫిర్యాదు

కశింకోట: మండలంలోని గొబ్బూరు గ్రామం వద్ద చెరువులు, కాలువలను సిమెంట్ పరిశ్రమ ఆక్రమించి సర్వీసు రోడ్డు, వంతెన నిర్మాణాలు చేసిందని, వీటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతు బుద్ద వెంకటరమణ సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. గైరమ్మ చెరువులో దాదాపు పదడుగుల మేర ఆక్రమించి సర్వీసు రోడ్డు, కిత్తయ్య చెరువు ఆక్రమించి వంతెన నిర్మించారని అందులో పేర్కొన్నారు. మామిడివాక గెడ్డ నుంచి చెరువుకు నీరు వచ్చే కాలువను ఆక్రమించడం వల్ల ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని వాపోయారు. సర్వీసు రోడ్డుతోపాటు ఇతర ఆక్రమణలు తొలగించాలన్నారు. ఈ ఆక్రమణలపై సర్వే చేశారని, దాని నివేదికను ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలో కార్మికులు

అనకాపల్లి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 59వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు మద్దతుగా రాష్ట్ర స్థాయిలో రెండు రోజులు పాటు 129 డిపోలలో రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయని ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి వి. అప్పారావు తెలిపారు. తక్షణమే కండక్టర్, డ్రైవర్లపై అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు. జోనల్ జాయింట్ కార్యదర్శి జి. శంకర్రావు, రీజనల్ కార్యదర్శి పి. సుధాకర్, డిపో అధ్యక్ష, కార్యదర్శి ఎన్. రావు, కె.ఎన్.వి. రమేష్, కె. గంగాధరం, ఎస్.ఎస్. మూర్తి పాల్గొన్నారు.

మాజీ సైనికుల కొవ్వొత్తుల ర్యాలీ



నాలుగు రోడ్ల జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

అనకాపల్లి టౌన్: పాకిస్థాన్‌ని మూడు ముక్కలు చేసి మ్యాప్‌లో లేకుండా చేస్తామని అనకాపల్లి మాజీ సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గాల హనుమంతరావు తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ సోమవారం రాత్రి స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో 50 మంది మాజీ సైనికులు కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో డిఫెన్స్ వ్యవస్థ చాలా పటిష్టంగా ఉందన్నారు. యుద్ధం వస్తే పాక్ పుట్టగతులు లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో కొణతాల రత్నకుమారి, వై సోనీ, మంజుల, నారిపల్లి సత్యారావు, సందపర్తి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చందనోత్సవానికి సన్నాహాలు

కశింకోట: స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం చందనోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఏటా వైశాఖ శుద్ధ తదియ రోజు ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం స్వామివారికి పూసిన చందనాన్ని తొలగించి నిజరూప దర్శనాన్ని మధ్యాహ్నం ఒంటిగంట వరకు కల్పించనున్నట్లు అర్చకుడు అత్తిలి సత్య వెంకట కేశవ కోదండపాణి తెలిపారు. సుగంధ ద్రవ్యాలు, చెరకు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



పదిలో ప్రగతి సాధించిన విద్యార్థులకు సత్కారం

చోడవరం రూరల్: విద్యార్థులు ఉత్తమ ప్రతిభలో అటు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎంఈవోలు బి.పడాలదాస్, కె.సింహాచలం అన్నారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. మండలంలోని 16 పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సైతం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మండలంలో పది ఫలితాలలో సాధించిన ఉత్తీర్ణత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పదిలో సాధించిన విజయం స్ఫూర్తిగా విద్యార్థులు తమ భవిష్యత్‌లో ఉన్నత విద్యలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

2 నుంచి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల ధర్నా



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవి ప్రసాద్

అనకాపల్లి టౌన్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్‌తో మే 2వ తేదీ నుంచి ధర్నా కార్యక్రమాలు చేపడతామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిప్రసాద్ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కనీస వేతనాలు లేక, ఉద్యోగ భద్రత వంటి సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు, కోశాధికారి పీవీ శ్రీనివాసరావు, నరసింగరావు, శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణతో ఉపాధి



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

కశింకోట: మహిళలు ఉచిత కుట్టు శిక్షణతో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. పల్లపు సోమవరం గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మహిళల కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఒక్కొక్క దఫా వంద మంది వంతున మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్. సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

మేహాద్రి కాలువ కబ్జా..!

చెరువులు మింగేస్తున్నారు. గెడ్డలు పూడ్చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను చెరబడుతున్నారు. బంజరు భూములను సొంతం చేసుకుంటున్నారు. డి ఫారం భూములను లాక్కుంటున్నారు. ఇప్పుడు ఏకంగా మేహాద్రి రిజర్వాయర్‌కు చెందిన స్థలాలపైనే కన్నేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినది మొదలు.. పెందుర్తిలో టీడీపీ, జనసేన నాయకుల కబ్జాకాండకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఎక్కడికక్కడ అధికారులను భయపెట్టి, మచ్చిక చేసుకుని ఇష్టానుసారం కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌కు చెందిన ఓ కాలువను ఆక్రమించి.. తమ ప్రైవేట్ స్థలాలకు ఏకంగా రోడ్డే వేసేస్తున్నారు..!

- ప్రైవేట్ స్థలానికి రోడ్డు కోసం చింతగట్లలో టీడీపీ నాయకుల దురాక్రమణ
- నీటిపారుదల శాఖ అనుమతి లేకుండా రోడ్డు వేసిన వైనం
- భూకబ్జాలు, దురాక్రమణలతో రెచ్చిపోతున్న కూటమి నాయకులు



రోడ్డును పరిశీలిస్తున్న నీటి పారుదల శాఖ అధికారి



నీటిపారుదల శాఖ అనుమతి లేకుండా మేహాద్రి భూ భాగంలో ఇష్టానుసారం తవ్విన టీడీపీ నాయకులు



చింతగట్ల పంచాయతీలో మేహాద్రికి నీరందించే కాలువ స్థలంలో లేఅవుట్ కోసం టీడీపీ నాయకులు వేసిన రోడ్డు

పెందుర్తి: మండలంలోని చింతగట్ల టీడీపీ నాయకులు మేహాద్రిగెడ్డ భూమిని ఆక్రమిస్తున్నారు. గ్రామానికి సమీపంలోని తమ సొంత స్థలానికి రోడ్డు వేసేందుకు రిజర్వాయర్ భూమిని ఎంచుకున్నారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ అనుమతి లేకుండా తమ సొంత నిధులతో రోడ్డును వేయడం టీడీపీ దురాక్రమణకు పరాకాష్టగా నిలుస్తోంది. ఈ ఆక్రమణపై స్థానికులు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అధికార కూటమి బరితెగింపు

అధికారం వచ్చిన నుంచి చింతగట్లలో కూటమి నాయకుల దౌర్జన్యకాండ కొనసాగుతోంది. అధికారం తమ చేతుల్లో ఉంది.. తామేం చేసినా చెల్లుతుందన్న బరితెగింపును గ్రామంలో ప్రదర్శిస్తున్నారన్న ఆక్షేపణలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికే పాఠశాల స్థలాన్ని స్థానిక జనసేన నాయకులు కబ్జా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. ఇప్పుడు టీడీపీ నాయకులు తమ వంతుగా ఏకంగా మేహాద్రి రిజర్వాయర్‌కు చెందిన భూ భాగంలోని కాలువను ఇష్టానుసారం తవ్వేశారు. సర్వే నెంబర్ 9, 10, 12లలో ఉన్న ఈ స్థలాన్ని ఆక్రమించి సొంత నిధులతో తమ స్థలానికి వెళ్లేందుకు వీలుగా రోడ్డు వేస్తున్నారు. స్థానికులు అభ్యంతరం చెబితే మీ సంగతి చూస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఈ కాలువ లేకపోతే గ్రామం మునకే!

టీడీపీ నాయకులు ఆక్రమించి రోడ్డు వేసిన కాలువ మేహాద్రి ఏర్పడిన నాటి నుంచి ఉంది. చింతగట్ల పంచాయతీలోని నందవరపువానిపాలెం, చింతగట్లలోని వర్షపు నీరు ఈ కాలువ ద్వారానే మేహాద్రిలో కలుస్తుంది. తాజాగా టీడీపీ నాయకుల దుశ్చర్య కారణంగా రాబోయే రోజుల్లో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ కాలువ పూడ్చేస్తే.. వర్షపు నీరు మేహాద్రికి వెళ్లే తావులేకుండా.. గ్రామంలోనే ఉండిపోతుంది. దీంతో ఇళ్లు, పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి టీడీపీ నాయకుల చెర నుంచి ఈ స్థలాన్ని కాపాడాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

> **ఉన్నతాధికారులకు నివేదించాం**
>
> ఇక్కడి మేహాద్రి కాలువపై చేపడుతున్న రోడ్డు నిర్మాణ విషయం మీద జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు వచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో ఆ స్థలాన్ని పరిశీలించాం. దీని నిర్మాణంపై ఎలాంటి అనుమతుల్లేవు. ఇక్కడి పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.
>
> – సుబ్బరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ కార్యాచరణ

- మే 4న సబ్బవరంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి కార్యాలయం ప్రారంభం
- పరవాడ మండల కార్యకర్తల సమావేశంలో సమన్వయకర్త అదీప్‌రాజ్



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కార్యాచరణ ఉంటుందని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రజలకు తెలిపి, వారిని చైతన్యపర్చడమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమన్నారు. సబ్బవరంలో మే 4న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ పాల్గొంటారని పేర్కొన్నారు. సబ్బవరంలో పార్టీ కార్యాలయం ప్రారంభించాక నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి పంచాయతీ నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు చుక్క రామునాయుడు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు వెన్నల సన్యాసిరావు, యూత్ అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్, ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ నదియా, పార్టీ సర్పంచ్‌లు పల్లా అప్పారావు నాగమణి, గొర్లి గోపిఅమ్మలు, బొండా కనకారావు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు, పార్టీ నాయకులు అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సుందరపు అప్పారావు, గొన్నా హేమచంద్రనాయుడు, బురద రాజు, పల్లా గోవిందు, వెన్నల సింహాద్రి, ఉమా మహేశ్వరి, పాశిల దివ్య, మడక సూరిబాబు, ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.